క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పాన్‌గల్: స్థానిక సంస్థల ఎన్నికల నిమిత్తం మండలంలోని అన్నారం, అన్నారం తండా, కేతేపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, తాగు నీటి వసతులపై ఆరా తీసినట్లు పేర్కొన్నారు. వసతుల్లో ఏమైనా సమస్య ఉంటే వాటిని పరిష్కారించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

నేడు అమరచింతకు ఎమ్మెల్యే రాక

అమరచింత: కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ నేపథ్యంలో సోమవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అమరచింతకు రానున్నట్లు తహసీల్దార్ రవి యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు సోమవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



వనపర్తి: సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి శత సహస్ర సూర్య నమస్కార పోటీల్లో వనపర్తి జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రికార్డు సాధించినట్లు అసోసియేషన్ సభ్యులు ఆదివారం తెలిపారు. లిఖిత్ 356, గిరినందన్ 312, చిద్విలాస్ 220, రోహన్ 200, సుగుణ 116 సూర్య నమస్కారాలు చేసి వరల్డ్ రికార్డుల్లో పేరు సంపాదించుకున్నారు. వీరికి తెలంగాణ యోగసాన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాంరెడ్డి, వ్యాస మహర్షి సంధ్య సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

ప్రహరీ నిర్మాణం చేపట్టరూ..



వనపర్తి రూరల్: మండలంలోని అంకూరు ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు రోడ్డుపైకి వస్తున్నట్లు తెలిపారు. పందులు, కుక్కలు పాఠశాలలోకి వస్తున్నాయని తెలిపారు. వెంటనే ప్రహరీ చేపట్టాలని అధికారులను కోరారు.

అసంపూర్తి డ్రెయినేజీతో ఇబ్బందులు



పాన్‌గల్: మండలంలోని బండపల్లి గ్రామంలో జమ్మాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీతో మురుగు రోడ్డుపై పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. డ్రైనేజీ సమస్య పరిష్కారించాలని పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తి డ్రైనేజీని పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. ఇట్టి విషయంపై ఎంపీఓ రఘురాములును వివరణ కోరగా డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరైన వెంటనే అసంపూర్తి డ్రైనేజీని పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ బుకింగ్

అలంపూర్ రూరల్ : మండల పరిధిలో యాసంగి పంటలకు డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు మండల వ్యవసాయధికారి నాగర్జున్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట వివరాల నమోదుతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతులకు ఎరువుల వినియోగానికి సమాచారం ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

- వందల మంది మహిళలకు స్వయం ఉపాధి
- స్వామి రామానంద తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ



కేంద్రంలో శిక్షణకు హాజరైన మహిళలు(ఫైల్)

గోపాల్‌పేట : గ్రామీణ ప్రాంతాల్లోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ టైలరింగ్, ఎంబ్రాయిడరీ ఉచిత శిక్షణ ద్వారా ఎంతో నిరుపేద మహిళలు, యువతుల ఉపాధికి భరోసాగా నిలుస్తోంది. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలో 2009 నవంబర్‌లో అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ప్రస్తుత రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి శిక్షణ కేంద్రాన్ని గోపాల్‌పేటలో ప్రారంభించారు. మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించి వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. దాదాపు పదిహేను సంవత్సరాల నుంచి 52 బ్యాచ్‌ల మహిళలు, యువతులు శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు.

వేయి మందికి పైగా శిక్షణ, ఉపాధి..

శిక్షణ కేంద్రంలో పది కుట్టు మిషన్లతో ప్రతి బ్యాచ్‌కు 20 నుంచి 25 మందితో కలిపి సుమారు 1200 మందికి పైగా కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ నేర్పించి సర్టిఫికెట్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించారు. జనవరి నెల నుంచి 53వ బ్యాచ్ ప్రారంభమైంది మార్చి 31 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకురాలు రామేశ్వరమ్మ తెలిపారు. ఎప్పుడైనా నేర్చుకునేందుకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

స్వయం ఉపాధి పొందుతున్నా..



నాలుగు సంవత్సరాల క్రితం స్వామి రామానంద తీర్థలో కుట్టుమిషన్, కంప్యూటర్ నేర్చుకున్నాను. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో కుట్టుమిషన్ షాపు పెట్టుకుని స్వయం ఉపాధి పొందుతున్నాను.

– ప్రియదర్శిని, గోపాల్‌పేట

వసతులు కల్పించాలి..



స్వామి రామానంద తీర్థ ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చి మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటి వరకు వేయి మందికి పైగా శిక్షణ అందించాం. శిక్షణ కేంద్రంలో మౌలిక వసతులు లేక ఇబ్బందిగా ఉంది. ప్రజా ప్రతినిధులు సాయం అందించాలి.

– రామేశ్వరమ్మ, ట్రైనర్, గోపాల్‌పేట

లోక కల్యాణార్థం చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

కొత్తకోట: లోక కల్యాణార్థం చండీ హోమం నిర్వహిస్తున్నట్లు శ్రీ భవాని శంకర ఆలయ ప్రధాన అర్చకులు సారంగదర కోటేశ్వర స్వామి అన్నారు. పట్టణంలోని భవానిశంకర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండో రోజు అమ్మవారి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ప్రతిష్ఠ కోసం ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభం, నవగ్రహ విగ్రహాలకు ధాన్యాధివాసం చేశారు. పూజల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు పాగాకు రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకుకు మఠం ఆనందయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



కొత్తకోటలో సంబరాల్లో బీజేపీ శ్రేణులు

కొత్తకోట: రాబోయో ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ కొమ్ము భరత్‌భూషణ్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై బీజేపీ కార్యకర్తలు ఆదివారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అందిస్తున్న సుపరిపాలన దేశమంతా వ్యాప్తి చెందుతుంది అనడానికి ఢిల్లీ ఫలితాలే నిదర్శనమన్నారు. ప్రజల జీవితాలను మెరుగు పరచడానికి బీజేపీ ఏ అవకాశాన్ని వదులుకోదన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ఢిల్లీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. అవినీతి, మోసం, అబద్ధాలు చెప్పి పాలించే పార్టీలకు భవిష్యత్తులో మనుగడ ఉండదన్న విషయం ఢిల్లీ ప్రజలు నిరూపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పబ్బ నరేందర్‌గౌడ్, కోటేశ్వర్‌రెడ్డి, రఘువేందర్, దాబా శ్రీనువాస్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, నవీన్‌రెడ్డి, బాలకృష్ణ, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న శ్రీహరి

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు గత 9 నెలలుగా వేతనాలు రాక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీహరి అన్నారు. కార్మికుల వేతనాలు చెల్లించాలంటూ చేపడుతున్న దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. 9 నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడని మండిపడ్డారు. సంబంధిత కాంట్రాక్టర్ వెంకటయ్య ఏజెన్సీ నిర్వహకులు కోతలు పెట్టడంతోపాటు గత ఏడాది ఆగస్టు నుంచి వేతనాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, భరత్, మోహినుద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న మన్నె జీవన్‌రెడ్డి

కొత్తకోట: మండల పరిధిలోని కానాయలపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు మన్నే జీవన్ రెడ్డి రూ.5 లక్షలు విరాళం, రెండు గోవులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జీవన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం మాజీ చైర్మన్ కురుమూర్తి యాదవ్, చిన్న తిమ్మన్న యాదవ్, సత్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



ఎస్ఐకు నగదు అందజేస్తున్న కత్తేపల్లి గ్రామస్తులు

ఆత్మకూర్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్సై నరేందర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కత్తేపల్లి, రేచింతల గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు ముందుకు రావాలన్నారు. సొంతంగా డబ్బులను సమకూర్చుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రేచింతల గ్రామస్తులు రూ.70 వేలు, కత్తేపల్లి గ్రామస్తులు రూ.30 వేలు ఎస్ఐకు అందజేశారు. కార్యక్రమంలో రాఘువేందర్, యాదయ్య, శివరామకృష్ణ, రాజు, మల్లేష్, నాగిరెడ్డి, మాసన్న, మన్యంకొండ, శ్రీనివాస్‌రెడ్డి, లాల్‌కుమార్, మెగిలన్న, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

మదనాపురం: గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గోవింద హళ్లీలో రూ. 25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, దాసరి రమేష్, చుక్క రాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

ఆత్మకూర్: మండల కేంద్రంలోని స్వయంభూ పరమేశ్వరస్వామి జాతర సందర్భంగా ముమ్మర ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ వెంకట నర్సింహరావ్, వైస్‌చైర్మన్ ఏపూరి యాదగిరిశెట్టి అన్నారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించి పరిసరాల్లో పెరిగిన ముళ్ల చెట్లను జేసీబీ ద్వారా తొలగించారు. వారం రోజుల పాటు జాతర ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు వేలాదిగా జాతర ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి తెలుగు నాగేష్, పూజారి కర్ణసయ్య తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆత్మకూర్: తోటి మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుని అండగా నిలిచారు ఆ స్నేహితులు. ఆత్మకూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. తమ మిత్రుడు చంద్రశేఖర్ మృతి చెందినట్లు తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి భార్య, బిడ్డలను పరామర్శించారు. అనంతరం రూ.50 వేలు నగదుతో పాటు కిరాణ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలరాజు, వెంకట్రాములు, శ్రీకాంత్, కిరణ్, లక్ష్మణ్‌రావ్, దామోదర్, మల్లికార్జున్, గాలిపంపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా కల్వర్టుల నిర్మాణం



అమరచింత: మురుగు కాల్వలపై నాసిరకంగా కల్వర్టుల నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని 8వ వార్డులో నిర్మిస్తున్న కల్వర్టుల నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయన్నారు. కల్వర్టు కోసం రహదారిని తవ్వి రోడ్ డైవర్షన్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పట్టణంలో ఐదు ప్రదేశాల్లో మురుగు కాల్వలపై నూతన కల్వర్టుల నిర్మాణానికి రూ.2.5 లక్షలు మంజూరైన కాంట్రాక్టర్ నాణ్యతతో పనులు చేపట్టడం లేదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట: మండల కేంద్ర శివారు గొల్లోని మిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. గోపాల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వనపర్తికి చెందిన చిన్నయ్య(చిన్న) ఆదివారం సాయంత్రం ఏడున్నర గంటల ప్రాంతంలో బైక్‌పై గోపాల్‌పేట నుంచి వనపర్తికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో చిన్నయ్య తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. గోపాల్‌పేటకు చెందిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

ప్రజాసేవలోనే సంతృప్తి



వాకిటి శ్రీధర్‌ను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

వనపర్తిటౌన్: ప్రజలకు సేవలు అందించడంలోనే ఎనలేని సంతృప్తి ఉందని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వరుసగా నాలుగు సార్లు కౌన్సిలర్‌గా సేవలందించిన వాకిటి శ్రీధర్‌కు ఆదివారం ఆ సంఘ భవనంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల వారిధిగా 20 ఏళ్లుగా పనిచేయడం ఎనలేని సంతోషం కలిగిస్తోందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలబడే నాయకులకు ఎప్పటికీ ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. రెండు దశబ్దాలుగా వాకిటి శ్రీధర్ ఎన్నికనే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామచందర్‌రెడ్డి, కార్యదర్శులు అంజయ్య, ఉపేంద్ర, సత్యనారాయణగౌడ్, రాఘవరెడ్డి, సహదేవ్‌గౌడ్, సత్యారెడ్డి, డీవీరావు కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంపీడీఓ గోవింద్‌రావు సూచించారు. ఆదివారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఎంఈఓ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. వార్షిక పరీక్షలపై పలు సూచనలు, సలహాలు అందించారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుతూ పరీక్షలను భయం లేకుండా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సబ్జెక్టుల వారీగా అనుమానాలు ఉంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు చేస్తున్న గిరిజనులు



విద్యుద్దీపాల అలంకరణలో దేవాలయం

ఖిల్లాఘనపురం: మండలంలోని షాపురం తండాలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గిరిజనులంతా ఐక్యతతో భక్తితో పూజా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. తండాలో శివ, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ, నంది, నాభిశిల(బొడ్రాయి) ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఆదివారం రుద్రపారాయణం, ఆవాహిత దేవతా పూజలు, రుద్రాభిషేకం, గణపతి హోమం, గ్రహ హోమం, వాస్తు హోమం, రుద్రహోమం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, దీక్షాహోమం తదితర ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో తండా వాసులతో పాటుగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కార్యకర్తలకు సూచనలిస్తున్న వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని కానాయపల్లి గ్రామంలో ఆదివారం స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక విషయంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు మండల నాయకుల సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, తాజా మాజీ ఎంపీపీ గుంత మౌనిక, హోటల్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, నరోత్తంరెడ్డి, గోపాల్ రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, రమేష్ రెడ్డి, భాస్కర్‌చారి, యాటకిరీ అంజన్న, వెంకటేష్ సాగర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాల బలోపేతానికి సిద్ధం



సంస్మరణ సభలో మాస్‌లైన్ పార్టీ నాయకులు

అమరచింత: ప్రజా సమస్యలతో పాటు కార్మిక ఉద్యమాలను బలోపేతం చేయడానికి సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నారు. మండల కేంద్రంలోని మార్క్ భవనంలో ఆదివారం విప్లవ ఉద్యమ కార్యశీలి యాదగిరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెత్తందారుల దోపిడికి వ్యతిరేకంగా విప్లవ పోరాటాలు చేసిన కమ్యూనిస్ట్ యోధుడు యాదగిరని కొనియాడారు. నేటి యువత ఆయన చూపిన విప్లవ స్ఫూర్తితో పేదల పక్షాన పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజన్న, కురుమన్న, ఆశన్న, భక్తి , జిలాని పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాన్‌గల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల 2001–02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని కేఎస్ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. దాదాపుగా 24 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు, గురువులు అప్యాయంగా పలుకరించుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలరాంమూర్తి, పుల్లారారెడ్డి, ఎండీ. గౌస్, సూర్యనారాయణ, శేఖర్, వరప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, భద్రసేనయ్య, యాకూబ్ అలీ, ఉషన్‌రెడ్డి, వెంకటయ్య, రామకృష్ణ, అనిల్, లక్ష్మి, హైమావతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం..

ఆత్మకూర్: మండలంలోని తిప్డంపల్లి హైస్కూల్‌లో 2007– 08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గురువులను సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శంకర్‌గౌడ్, మల్లప్ప, వెంకటకృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శశిరెడ్డి, వసంతకుమార్, శంకర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



దంతనూరులో ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

మదనాపురం: త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండలంలోని దంతనూరులో ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు ప్రచారం నిర్వహించారు. మాఘమాసంలో సగుణ, నిర్గుణ పూజల విశిష్టత తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాసన్న, వేణుగోపాల్, బాలకష్ణ, శివ, తిరుమలేశు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.